క్లుప్తంగా

వలంటీర్ల రాజీనామా



రాజీనామా లేఖను సమర్పించిన జేగురుపాడుకు చెందిన వలంటీర్లు

కడియం: మండలంలోని జేగురుపాడు గ్రామానికి చెందిన రెండు సచివాలయాల పరిధిలోని 33 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు తమ లేఖలను ఎంపీడీవో కార్యాలయం ఏవో సుబ్బారావుకు, పంచాయతీ కార్యదర్శి బి. శిరీషాలకు అందజేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు వారు తమ లేఖల్లో పేర్కొన్నారు. గత 58 నెలలు నుంచి ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతిపక్షాలకు చెందిన కొందరు పనిగట్టుకుని తమపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో మనస్తాపంతో తామంతా స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వార్షిక మరమ్మతుల కారణంగా మోరంపూడి సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీఈసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ బుధవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు మోరంపూడి జంక్షన్, గణేష్ నగర్, క్యూబటిక్ విల్లాస్, హనుమాన్ నగర్, శ్రీనగర్ కాలనీ, శుభమస్తు ఫంక్షన్ హాల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్ట తెలిపారు.

పిల్లల విజయానికి తల్లిదండ్రుల ప్రేమే కారణం



సదస్సులో మాట్లాడుతున్న సైకాలజిస్ట్ సతీష్

రాజమహేంద్రవరం రూరల్: తల్లిదండ్రులు తమ విలువైన సమయాన్ని పిల్లలతో గడపడమే వారి విజయ రహస్యమని వల్లిశెట్టి సతీష్ అన్నారు. బొమ్మూరులోని స్థానిక సెయింటాన్స్ పాఠశాలలో ప్రిన్సిపల్ సిస్టర్ ఝాన్సీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన సదస్సు బుధవారంతో ముగిసింది. అడ్వాన్స్డ్ మైండ్ సీఈవో, సైకాలజిస్ట్ వలిశెట్టి సతీష్ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్ని విజయవంతులుగా తీర్చిదిద్దేందుకు అనుసరించాల్సిన విషయాలపై సూచనలు వివరించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ ఝాన్సీ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువు నేర్చుకోవాలన్నారు. విద్యార్థులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా విద్యాభ్యాసం సాగడానికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంలను సిద్ధం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: అభ్యర్థులు ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడకుండా ఎన్నికల సంఘం ఉత్తర్వుల ప్రకారం ప్రచారం చేసుకోవాలని సిటీ రిటర్నింగ్ అధికారి, కమిషనరు కె.దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం క్షేత్రస్థాయిలో అభ్యర్థుల కోసం ప్రచారం నిర్వహిస్తున్న ఆటోల వద్ద అనుమతి పత్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, అభ్యర్థులు ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడకుండా తమ కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. లేకుంటే ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికలకు సంబంధించి రిసెప్షన్, డిస్ట్రిబ్యూషను, కౌంటింగు సెంటర్లను అధికారులతో కలిసి సందర్శించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ చేసేందుకు ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలను, రిసెప్షను, కౌంటింగ్ సెంటరుగా నన్నయ విశ్వవిద్యాలయాన్ని ఎంపిక చేశామన్నారు. మే 12న ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తామన్నారు. సూపరింటెండింగ్ ఇంజినీరు జి.పాండురంగారావు, డీఎస్పీ సెంట్రల్ కె.విజయపాల్, డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ రమణ, తహసీల్దారు అర్బన్ కె.అంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్లు, టౌన్ సర్వేయర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన శిబిరంలో యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.షరీఫ్, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ లక్ష్మీకుమారి, జిల్లా కోశాధికారి ప్రసాద్, జిల్లా కార్యదర్శులు రమేష్‌బాబు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పెషల్ పార్టీ సిబ్బందికి యూనిఫాంల అందజేత

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ముగ్గురు ఇన్‌చార్జిలు, 45 సిబ్బందితో మూడు స్పెషల్ పార్టీలను ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన బుధవారం స్పెషల్ టీం సిబ్బందికి రెండు జతల జంగిల్ పాచ్ యూనిఫాం, జంగిల్ షూ, క్యాప్, బెల్ట్, కిట్ బ్యాగ్ యూనిఫాం, షూష్‌లను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు అనిల్ కుమార్, ఎల్.చించి రెడ్డి, డి.ప్రభాకర్, డీఎస్పీ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పండుటాకులకు పాత కష్టాలు



కడియం మండలం బుర్రిలంక సచివాలయం వద్ద పింఛను కోసం బారులుదీరిన లబ్ధిదారులు

- పెన్షన్ల కోసం పడిగాపులు
- చంద్రబాబు నాటి చీకటి రోజులు గుర్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

కడియం: వాళ్లంతా ఆరేడు పదులు దాటిన వారు. కనీసం పది నిముషాలు కూడా ఏకధాటిగా నిలబడే ఓపిక లేని వాళ్లు. ఇంకొందరైతే వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడేవారు. మరి కొందరు దివ్యాంగత్వం కారణంగా తమ పనులు తాము చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నవారు. వీళ్లందరికీ పింఛను కోసం పాత కష్టాలు మొదలయ్యాయి. ఈ పండుటాకుల కష్టాలు గుర్తించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వారి వారి ఇంటి ముంగిటకే పింఛను పంపిణీ చేసేలా వలంటీర్లను ఏర్పాటు చేశారు. ప్రతి నెలా ఒకటో తారీకునా పింఛను అందేలా చర్యలు తీసుకున్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఏలాంటి ఇబ్బంది పడకుండా పింఛను అందుకుంటున్నారు. అయితే ఆ ముసలివాళ్లకు పింఛన్ల కోసం మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. టీడీపీ అధినేత చంద్రబాబు కారణంగా సచివాలయాల వద్ద పడిగాపులు పడుతున్నారు. విపక్షాలు చేసిన కుట్రల కారణంగా వలంటీర్ల ద్వారా పింఛన్లు అందించడానికి అడ్డంకులు సృష్టించారు. దీంతో వీరికి గతంలో నారా చంద్రబాబునాయుడి హయంలో ఎదొర్కొన్న కష్టాలన్నీ మళ్లీ మొదలయ్యాయి. బారులు తీరిన లైన్లలో గంటల తరబడి వేచి చూడడాలు ఇప్పుడే మళ్లీ కన్పిస్తున్నాయి. పింఛను లబ్ధిదారులకు ఇబ్బందుల్లేకుండా సచివాలయాల ద్వారా పంపిణీ చేయాలని నిర్ణయించారు. అయితే బుధవారం పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. క్యూలైన్లలో నిలబడి పెన్షన్ కోసం ఎదురు చూసే పరిస్థితులు మళ్లీ ఎదర్కొంటున్నారు. గతంలో తాము పడిన ఇబ్బందులు, సీఎం జగన్ హయాంలో మతకు అందిన సదుపాయాలు, మళ్లీ ఇప్పుడు పడుతున్న ఇబ్బందులను గుర్తు చేసుకుంటున్నారు.

అందితే జుట్టు..అందకుంటే కాళ్లు..

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): అందితే జుట్టు.. అందకుంటే కాళ్లు అన్న చందాన ఉంది టీడీపీ నేతల తీరు. ఎన్నికల కోడ్ వంకతో వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకూడదని టీడీపీ నేతలు ఫిర్యాదు పెట్టించి పంపిణీని నిలిపివేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ ఇంటి వద్దకే వచ్చి ఇచ్చే వలంటీర్ రాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు. మా నోటి వద్ద కూడు పాగొట్టరంటూ మండి పడుతున్నారు. ఒక్కసారిగా ప్రజల్లో వ్యతిరేకత రావడంతో టీడీపీ కూటమి దానిని సరిదిద్దుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తోంది. మంగళవారం ప్రజావ్యతిరేకతను గమనించి నగరపాలక సంస్థ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ దినేష్‌కుమార్ అందుబాటులో లేకపోవడంతో ఏడీసీ సత్యవేణికి వినతిపత్రం అందించారు. వలంటీర్లతో పింఛన్ పంపిణీ చేయించడం వల్ల మాకు ఎటువంటి అభ్యంతరం లేదని చెప్పుకొచ్చారు. అంతేకాక బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ పింఛన్ పంపిణీ చేయడానికి సచివాలయ సిబ్బంది సరిపోకపోతే మా తెలుగుదేశం కార్యకర్తలు వెళ్లి ఇంటింటికి పింఛన్ పంపిణీ చేయడానికి సహకరిస్తామనడం కొసమేరుపు. వలంటీర్ల ప్రభుత్వం గురించి చెప్పుతున్నారని వారిని పింఛన్లు ఇవ్వకుండా చేసి ఇప్పుడు కోడ్ అమలలో ఉండగా వీరు వెళ్లి పింఛను పంపిణీకి సహకరిస్తామనడం విడ్డూరంగా ఉందని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.



ఏడీసీ సత్యవేణికి వినతి పత్రాన్ని అందిస్తున్న టీడీపీ నాయకులు

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో చేపట్టిన అభివృద్ధికి ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఎంపీ, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. బుధవారం టీడీపీకి చెందిన సుమారు 200 మంది నాయకులు కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. బుధవారం నగరంలోని 14వ డివిజన్ గోరక్షణ పేట వాటర్ ట్యాంక్ రోడ్డులో పార్టీ డివిజన్ ఇన్‌చార్జి పెంకే సురేష్, మాజీ కార్పొరేటర్ సుధారాణిల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నుంచి శివ, సత్యవాణి, లావణ్య నేతృత్వంలో సుమారు 200 మంది టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ ఎంపీగా నగరాన్ని అభివృద్ధి చేసిన తీరు వివరించారు. ఈ కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ అబ్జర్వర్ రావిపాటి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన కార్యకర్తలతో ఎంపీ మార్గాని భరత్‌రామ్ చిత్రంలో రౌతు సూర్యప్రకాశరావు

వంతెన పరిసరాల్లో ఇసుక తవ్వకాలు జరపొద్దు

జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి వంతెన పరిసర ప్రాంతాల పరిధిలో 500 మీటర్ల దూరం వరకు ఎటువంటి ఇసుక తవ్వకాలు నిర్వహించకూడదని, జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత హెచ్చరించారు. బుధవారం ఆమె ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. గోదావరి వంతెనలకు 500 మీటర్ల దూరం గుర్తించే ప్రక్రియలో భాగంగా సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకునేందుకు టాస్క్ ఫోర్స్ టీమ్ ఎస్ఈబీ, రెవెన్యూ, జల వనరులు, గనులు–భూగర్భ శాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో బీ1 కేటగిరి కింద 10 ఇసుక రీచులకు పర్యావరణ అనుమతుల కోసం ఆమోదం తెలిపిందన్నారు. ఇసుక డిసిల్టేషన్ అనుమతులు నిర్దిష్ట ఆరు నెలల కాల పరిమితితో కూడిన పరిమాణాన్ని అనుమతులు మంజూరు కోసం రివర్ కంజర్వేటర్ కోసం తగిన ప్రతిపాదనలు కోసం సమావేశంలో తీర్మానించామన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆల్కట్ గార్డెన్స్‌లో మూడు ఇసుక రీచ్‌లను నిలిపివేసినట్టు తెలిపారు. విజ్జేశ్వరంలో జరిగే ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా అరికట్టుటకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు. ఫీజబులిటీ రావలసిన రెండు రీచులు (5 హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణం) సంబంధిత శాఖల నుంచి అనుమతి పొంది తదుపరి చర్యలు తీసుకోవాలని కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. పర్యావరణ అనుమతులు సాధ్యమైనంత వరకు పొంది అన్ని ఇసుక రీచ్ కార్యకలాపాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జేపీ ఎస్.తేజ్ భరత్, కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవత్సవ, జిల్లా మైన్స్ అధికారి ఎం.సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ – ఎస్ఈడీ బాలశంకరరావు, డీడీ భూగర్భ జలాలు వై.శ్రీనివాస్, సెబ్ అదనపు ఎస్పీ వి.సోమశేఖర్, డీటీఓకేవీ కృష్ణారావు, ఇరిగేషన్ ఈఈ రమేష్, పోలీస్, డీపీవో, ఈఈ గోదావరి వాటర్ హెడ్స్, పర్యావరణ, మైన్స్ అధికారులు, ప్రతిమ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పనుల వల్ల ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో వివిధ ప్రదేశాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వల్ల ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజినీరింగు అధికారులను కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో అధికారులతో కలసి పరిశీలించారు. దానవాయిపేటలో గాంధీపార్కు అభివృద్ధి, సీసీ రోడ్లు, క్వారీ మార్కెట్ వద్ద ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహం, లేపాక్షి ఎంపోరియం వద్ద చేపట్టిన జంక్షను అభివృద్ధి, కంబాలచెరువు చెరువు జంక్షను అభివృద్ధి, డ్రైను నిర్మాణం, నాగులచెరువు మార్కెట్ జంక్షను అభివృద్ధి, మెయిన్ రోడ్డు రత్నా పేలస్ వద్ద నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ చేపట్టిన అనేక అభివృద్ధి పనులను ఇప్పటికే పూర్తి చేయగలిగామని మిగిలిన పనులు కూడా అతి త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. పనులన్నీ నాణ్యత ప్రమాణాలతో ఉండేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీరు జి.పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శేషగిరిరావు, మదర్ షా అలీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంటు ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

అవ్వాతాతలపై చంద్రబాబు కక్ష

- రాష్ట్ర వ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవడంతో మాట మారుస్తున్న టీడీపీ నేతలు
- ఎంపీ మార్గాని భరత్ రామ్



విలేకరుల సమావేశంలో ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: తమ వల్లే పింఛన్ల పంపిణీ నిలిచిపోయిందని మీడియా ముందు గొప్పలు చెప్పుకున్న టీడీపీ నేతలు అవ్వాతాతల ఆగ్రహం కట్టలు తెంచుకోవడంతో ఇప్పుడు మాట మారుస్తున్నారని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ ధ్వజమెత్తారు. బుధవారం ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వచ్చినా అవ్వాతాతలు, దివ్యాంగు పింఛన్లు అందుకోకుండా వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేసి టీడీపీ నేతలు సంతోష పడుతున్నారన్నారు. ఒకరు బాధపడుతుంటే ఆనందించే మనస్తత్వం ఉన్నవారు మనుషులు కారని, నరరూప రాక్షసులని ఆగ్రహం వ్యక్తం చేశారు చేసిదంతా చేసేసి, పింఛన్ల పంపిణీ ఆగిపోయాక, రాష్ట్ర వ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తం అవుతుంటే దానిని సరిదిద్దుకునేందుకు చంద్రబాబు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. ఇళ్ల వద్దకు వెళ్ల పింఛన్లు ఇవ్వొద్దని ఎన్నికల సంఘం ఎటువంటి ఆంక్షలు పెట్టలేదని మళ్లీ చంద్రబాబు చెబుతుండడం విచిత్రంగా ఉందన్నారు. వలంటీర్ల ద్వారా గత అయిదు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా లబ్ధిదారుల ఇళ్లకు వేకువజామున వెళ్లి తలుపుకొట్టి పింఛను ఇచ్చేవారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 66.7లక్షల మందికి పింఛనుదారులకు రూ.3 వేలు చొప్పున అందజేయాలన్నారు. ఒక్క రాజమహేంద్రవరం నగరంలోనే 32 వేలమందికి పైగా ఉన్నారన్నారు. వలంటీర్ల సేవలు వినియోగించకుండా పింఛన్ల పంపిణీ కష్టమన్నారు. పింఛన్ల పంపిణీ జరగకుండా అడ్డుకున్నది చంద్రబాబు అని, పైపెచ్చు రాష్ట్ర ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ఎంపీ మండిపడ్డారు. చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. చంద్రబాబు హయాంలో పింఛన్ల కోసం పడిగాపులు పడేవారని, ఇప్పుడు వారిని ఇబ్బంది పెడుతున్నారన్నారు. సిటీ ఎమ్మెల్యే భవానీ భర్త ఆదిరెడ్డి వాసు లోకేష్, చంద్రబాబుకు చెబితే ఎన్నికల కమిషన్ కు చంద్రబాబు లేఖ ద్వారా తెలియజేశారనిప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మేమే పింఛన్ల పంపిణీని ఆపించామని వాసు చెప్పడం అవ్వాతాతలపై, దివ్యాంగులపై, వలంటీర్లపై ఉన్న కక్ష బయటపడిందన్నారు. వాసు నిర్ణయాన్ని లేదా అభిప్రాయాన్ని నిజమేనని ఏకీభవించిన డీఎస్పీ ఎవరో చెప్పాలని ఎంపీ డిమాండ్ చేశారు. ఏ డీఎస్పీ వలంటీర్ల ద్వారా ఇవ్వ కూడదని చెప్పారో వాసు వెల్లడించాలన్నారు. దీనిపై ఆర్వోను కూడా వివరణ అడుగుతానన్నారు. మొత్తంపై నగరంలో 32 వేల మందికి పైగా పింఛన్ల లబ్ధిదారులను రోడ్డు మీదకు లాగి ఇబ్బందులు పాల్జేసింది ఆదిరెడ్డి వాసు అనేది అందరికీ తెలిసిందని, ఇప్పటికైనా ప్రజలు వీరి మనస్తత్వం ఎటువంటిదో గ్రహించాలని ఎంపీ భరత్ రామ్ కోరారు.

చేసిన అభివృద్ధిపై మీ తీర్పు కావాలి

బార్ అసోసియేషన్‌లో ఎంపీ భరత్



న్యాయవాదులతో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ భరత్‌రామ్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): చారిత్రాత్మకంగా ప్రసిద్ధిగాంచిన రాజమహేంద్రవరం వారిని గత వైభవం తీసుకు రావాలనేదే నా లక్ష్యమని రాజమహేంద్రవరం ఎంపీ, సిటీ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎంపీ భరత్, రాజమహేంద్రవరం లోక్‌సభ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ఎంపీగా ఈ అయిదేళ్లలో నగరాన్ని ఎంత అభివృద్ధి చేశానో ప్రత్యక్షంగా కనిపిస్తోందని, గతంలో ఏ ఎంపీ నగరాభివృద్ధిపై దృష్టి సారించలేదన్నారు. కనీసం ప్రజల వద్దకు వచ్చి వారి సాధక బాధలు విన్నదీ లేదన్నారు. తాను ఎప్పుడూ ప్రజల మధ్యనే ఉన్నానని, నా కుటుంబ సభ్యులతో కన్నా నగర వాసులతోనే మమేకమయ్యానన్నారు. చేసిన అభివృద్ధిని చూసి, రేపు జరగబోయే ఎన్నికలలో సిటీ ఎమ్మెల్యేగా గెలుపొందడానికి ఓటు రూపంలో మీ ఆశీస్సులు కావాలన్నారు. ఎమ్మెల్యేగా గెలిస్తే చేయబోయే అభివృద్ధి పనులను న్యాయవాదులకు వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్, ఉపాధ్యక్షుడు స్వర్ణ పాప, జనరల్ సెక్రటరీ పి.రమేష్, యాదల సతీష్ చంద్ర స్టాలిన్, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి గూడూరి రాధిక, వైవీ శ్యామల, బార్ అసోసియేషన్ సభ్యులు మారిశెట్టి వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి శంభుప్రసాద్, ఎండీ ఆరీఫ్, కోడి సతీష్ నాయుడు, హాసన్, ఎండీ అన్వర్, మహిళా న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం

- రాజవోలు ఎన్నికల ప్రచారంలో రూరల్ అభ్యర్థి చెల్లుబోయిన వేణు
- టీడీపీ నుంచి 150 మంది వైఎస్సార్‌సీపీలో చేరిక



రాజవోలు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పార్టీలో చేరిన వారితో మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: ఇచ్చిన మాటకు కట్టుబడి గడచిన 58 నెలల్లో సంక్షేమపాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాశీర్వాదంతో మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. మాజీ వైస్ ఎంపీపీ నక్కారాజబాబు ఆధ్వర్యంలో రాజవోలు గ్రామంలో బుధవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రమాదేవి గార్డెన్స్, చర్చిపేట, ఇందిరానగర్, కోనేరుపేట, రజకులపేట, అరుంధతిపేటలో ఇంటింటికీ వెళ్లి పార్టీశ్రేణులతో కలిసి మంత్రి వేణుగోపాలకృష్ణ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టగా, మహిళలు హారతులు పట్టారు. అనంతరం చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయనటువంటి సంక్షేమ కార్యక్రమాలు సీఎం వైఎస్ జగన్ చేశారన్నారు. ఆయన చేసిన సంక్షేమ కార్యక్రమాలే మాకు శ్రీరామరక్షగా అభివర్ణించారు. వై రూరల్ అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా గూడూరి శ్రీనివాస్‌ను ఫ్యాన్ గుర్తుపై వేసి గెలుపించాలని కోరారు.

150 మంది పార్టీలో చేరిక

రమాదేవి గార్డెన్స్‌లో టీడీపీ నుంచి మెర్లసాయి, ఆయన మిత్ర బృందం, చర్చిపేటలో బికిలేవినోద్ అండ్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు, అరుంధతీపేటలో అనంతారపు రమేష్, అనాంతరపు ఫ్యామిలీ సభ్యులు అధిక సంఖ్యలో 150 మంది పార్టీలో చేరారు. వారికి మంత్రి వేణుగోపాలకృష్ణ, నక్కారాజబాబు తదితరులు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్రస్టాలిన్, మాజీ ఎంపీటీసీ నక్కా శ్యాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, నక్కా రాజేంద్ర, జుత్తుక వసంత్, బూసికృష్ణ, మట్టా వీర్రాజు, సింహాద్రి రామలక్ష్మి, నిశ్చన కోళ్ల తాతారావు, పేట రామకృష్ణ ఎస్.రమణ, రత్నరాజు, చెల్లయమ్మ, కోటి, బాలు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన



జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఎన్నికల సమావేశం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్ఈబీ పోలీసు అధికారులు, సిబ్బందికి ఎన్నికల విధులపై జిల్లా ఏఎస్పీ పి.సోమశేఖర్ బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 28ఏ ప్రకారం ఎన్నికల నిర్వహణ విధులకు కేటాయించిన అధికారులందరూ ఎన్నికల నిర్వహణ ఉత్తర్వులు వచ్చిన నాటి నుంచి నిబంధనలకు లోబడి విధులు నిర్వర్తించాలన్నారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమ విధి నిర్వహణలో అందరిని సమభావంతో చూడాలన్నారు. ఏ రాజకీయ పార్టీ పక్షాన వ్యవహరించకూడదని తెలిపారు. ఇతరులు ఎవ్వరిని పోలింగ్‌స్టేషన్‌కి 100 మీటర్ల దూరం వరకు అనుమతించకూడదన్నారు. గత ఎన్నికలలో బూత్ ఆక్రమణలు గాని, బూత్‌లలో బెదిరింపులకు పాల్పడిన వారిపై తగిన చర్య తీసుకోవాలన్నారు. మద్యం అక్రమంగా నిలువ చేసిన ప్రదేశాలపై సమాచారం తెలిసిన వెంటనే తగిన చర్యలు తీసుకోవడానికి పై అధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికల ముందు నిర్వహించాల్సిన విధులు, తర్వాత నిర్వహించాల్సిన విధుల గురించి వివరించారు.

వైభవంగా మహా గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయంలో విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవంలో జక్కంపూడి రాజా, డాక్టర్ రాజశ్రీ దంపతులు



విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

కాలభైరవ గురుస్వామి ఆధ్వర్యంలో మహోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి గ్రామ పంచాయతీ పరిధిలోని బుచ్చియ్యనగర్‌లో శ్రీక్షిప్ర సంకట హర ఆరోగ్య మహాగణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం కాలభైరవ గురుస్వామి వారి సమక్షంలో వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకులు జక్కంపూడి విజయలక్ష్మి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవంలో రాజానగరం శాసనసభ్యులు జక్కంపూడి రాజా, డా.రాజశ్రీ దంపతులతోపాటు, బుచ్చియ్యనగర్‌కు చెందిన పలువురు దంపతులు పీటలపై కూర్చుని శాస్త్రోక్తంగా పూజలు, హోమం నిర్వహించారు. ఈ మహోత్సవానికి రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు, జక్కంపూడి కుటుంబ సభ్యులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిందని, అనివార్య కారణాల వల్ల ఆలయం నిర్మాణంలో జాప్యం ఏర్పడిందన్నారు. తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు ఆశయ సాధనకు అనుగుణంగా జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్, ఇతర పెద్దల సహకారంతో ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ఈ ఆలయాన్ని ప్రారంభించామన్నారు. ఈ ఆలయ సముదాయంలో భాగంగా కాలభైరవ ఆలయం, గౌరీ శంకర్ల ఆలయం, దత్తాత్రేయుల ఆలయం, శ్రీరామాలయం, దుర్గాలయంతో పాటు నవగ్రహ ఆలయాలను అతి సుందరంగా తీర్చిదిద్దామన్నారు. శ్రీక్షిప్ర సంకట హర ఆరోగ్య మహా గణపతి దేవాలయంలో స్వామి వారికి పూజలు చేస్తే అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆరోగ్యం కుదుటపడుతుందని, కోరిన కోరికలు కూడా నెరవేరుతాయన్నారు. ఆలయ ప్రాంగణంలో మహాఅన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో హుక్కుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, బుచయ్యనగర్ పెద్దలు, గ్రామ వాసులు,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించే పార్టీలకే మద్దతు

కంబాలచెరువు: ప్రైవేటు విద్యాసంస్థల సమస్యలపై స్పందించే పార్టీలకే తమ మద్దతు అని రాజమహేంద్రవరం అన్ ఎయిడెడ్ కాలేజెస్ అండ్ స్కూల్స్ అసోసియేషన్ తెలిపింది. ఈ సందర్భంగా స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ అసోసియేషన్ నాయకులు టీకే విశ్వేశ్వరరెడ్డి, తేజస్ స్కూల్ పి.కళ్యాణ్‌రెడ్డి, మెగా జూనియర్ కాలేజ్ సీహెచ్ గంగాధర చౌదరి, ఆదిత్య విద్య సంస్థలు డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, సోబా పబ్లిక్ స్కూల్ సురేష్, ప్రగతి విద్యాసంస్థలు సుంకర మురళి, అక్షర శ్రీస్కూల్ నాగరత్నం, రమేష్, సూర్యదీప్ స్కూల్ భాస్కర్ మాట్లాడారు.